
# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JANUARY - 2003

# సంక్షిప్త వార్తలు

2002 నవంబరు 28న జాషువా గూటం గారు సతీసమేతముగా మద్రాసు - సింగపూర్ మీదుగా థాయ్‌లాండ్‌కు బయలు వెళ్లిరి. 29న మద్రాసులో నిలిచి ఆయన మరికొన్ని టి.వీ. ప్రసంగములను రికార్డు చేసిరి. డిశంబరు 2వ తేది నాటికి థాయ్‌లాండ్‌లో చియింగ్‌మై అను పట్టణము చేరుకొనిరి.

2002 డిశంబరు 3వ తేదీ నాడు చియింగ్‌మైలో జరుగుచున్న ఏషియన్ బైబిలు లెక్చర్‌షిప్‌లో జాషువాగారు ఉపన్యసించిరి. ఆ లెక్చర్‌షిప్‌కు పది దేశముల నుండి సువార్తికులు హాజరైరి. జాషువా గారి ఆంగ్ల ప్రసంగమును థాయ్ భాషలోనికి సోదరులు డోర్స్‌ట్రా గారు అనువదించిరి. డోర్సేగారు గత 40 సంవత్సరముల నుండి థాయ్‌లాండ్‌లో మిషనెరీగా పనిచేయుచున్నారు.

జాషువా గూటం దంపతులు డిశంబరు 5వ తేదీ రాత్రికి తిరిగి మద్రాసు చేరుకొని,అక్కడకొరుక్కుపేటలో జరుగుచున్న సువార్తకూటములో పాల్గొని 3 ముఖ్య ప్రసంగములను చేసిరి. మద్రాసు కొరుక్కుపేటలో డిశంబరు 5,6,7. తేదీలలో సువార్త కూటములు జరిగెను. ఆ సువార్త కూటములలో సోదరులు బొంతు ధనరాజు (అమలాపురం), జాషువా గూటం మరియు సి.హెచ్. జేకబ్ (బెంగుళూరు) గార్లు వాక్యోపదేశము చేసిరి. స్థానిక సంఘస్థులు, నెల్లూరు, చిత్తూరు జిల్లాలలో యున్న అనేక మంది సువార్తికులు ఆ కూటములకు హాజరై గొప్ప సహవాసములో పాల్పొందిరి. కొరుక్కుపేటలోను తదితర ప్రాంతములలోను సోదరులు వి.రాజు గారు క్రీస్తు కొరకు మంచిపని చేయుచున్నారు.

డిశంబరు మొదటి తేదీ ఆదివారం సాయంత్రం పెద్దాపురం మండలం చదలాడలో యున్న క్రీస్తు సంఘ ఆవరణలో గొప్ప సువార్త కూటము జరిగెను. ఆ కూటమునకు పరిసరగ్రామముల నుండి ఆనేకులు హాజరై సువార్తను వినిరి. సోదరులు డి.జె. ప్రకాశ్ (సత్యవాణి - కాకినాడ)

# సత్యవాక్కు
# THE WORD OF TRUTH
P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
**Joshua Gootam**

Pleading for Restoration of First Century Christianity

సంపుటిక 23 జనవరి 2003 సంచిక

## ఆరాధనామూర్తి

*(The Object of Worship)*

మానవుడు భక్తిపూరితుడు. అతడు తన కంటే గంభీరుడై ఉన్నతుడైన వానిని పూజించ కోరిక గలవాడు. అయితే ఆరాధనీయుడెవరు ? ఆయనను మనం ఎట్లు ఆరాధించాలి ?

దేవునినిగాని లేక ఒక పరిశుద్ధమైన పవిత్రమైన మూర్తిని గాని భక్తి పూర్వకముగా పూజించి గౌరవించుట 'ఆరాధన' యని అనవచ్చును. మానవుడు ఆత్మీయౌన్నత్యమును పొందుట కది ఒక క్రియయై యున్నది. మానవుడు భగవంతునితో లీనమగుటకు ఆరాధననొక గొప్ప ప్రాముఖ్యత నొసగుచున్నది. ఆరాధన యను పదము బైబిలు నందు ఇంచుమించు 191 మారులు ఉపయోగింపబడెను. అది పాత నిబంధనలో 113 మారులు, క్రొత్త నిబంధనలో 78 మారులును కన్పడును. ఆదినుండియు మానవులు

దేవుని నారాధించు స్వభావము కలవారని చరిత్ర మనకు తెలియజేయు చున్నది. మానవునికంటె దేవుడు మిన్నయైన వాడనియు, శక్తిమంతుడు అనియు వారు గ్రహించినందున వారాయన నారాధింప మొదలిడిరి. అయితే మానవుడు స్వాభావికముగా ఆరాధించుట ఎట్లో ఎరుగనివాడు. ఆదిలో దేవుడు మానవునితో ప్రత్యక్ష సంబంధమును కలిగియుండిన కాలములో దేవుడు మానవునికి ఆరాధించు విధానమును గరపియుండె ననుట నమ్మతగినది. పరిశుద్ధుల సభలో ఆయన మిక్కిలి భీకరుడనియు, పూజింపతగినవాడనియు బైబిలు దేవుని గూర్చి బోధించుచున్నది. "మన దేవుడైన యెహోవాను ఘనపరచుడి. ఆయన పాదపీఠము ఎదుట సాగిలపడుడి. ఆయన పరిశుద్ధుడు" అని దావీదురాజు పరిశుద్ధాత్మవలన పలికెను (కీర్తన 99 : 5).

దేవుడెవరు? ఆయన ఎక్కడనుండి వచ్చెను? అను మొదలగు ప్రశ్నలను మనము తరచు ఎదుర్కొనుచూ యుంటాము. బ్రహ్మాండమైన ఈ విశ్వ మంతయును ఎట్లు కలిగెనో అది మానవ ఊహాతీతమైనది. గంభీరమైన విశ్వమంతటికిని కారణమైన ఒక ఆదిశక్తిని యుండి తీరవలెను. అయితే ఆ శక్తి ఎవరు? ఏదైన నిర్జీవమైనదాని నుంచి జీవముద్భవించుట అసాధ్యము గనుక ఆ శక్తి సజీవుడైనవాడై యుండ వలెను. అందువలననే ప్రపంచములు దేవుని వాక్యము వలన నిర్మాణ మైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడ లేదనియు విశ్వాసము చేత గ్రహించుకొనుచున్నాము. దేవుడు ఆదియును అంతమునై యున్నాడని బైబిలు బోధించుచున్నది. ఆయన అనంతము నుండి అనంతము వరకు ఉన్నట్టివాడు. ఆయన ఎల్లప్పుడూ ఉండువాడు. అట్టి గంభీరమైన వానిని అంగీకరించుచు మానవులు ఆయనను భక్తిపూర్వకముగ గౌరవించుట మొదలిడిరి. ఆదిలో మానవుడు ఒకే దేవుని

ఆరాధించెడివాడని చరిత్ర కూడ మనకు బోధించుచున్నది. తరువాత దినముల గడచినకొలది మానవులు సత్యమార్గము నుండి తొలగిపోయి వారి ఇచ్ఛానుసారముగ దేవుండ్లను సృజించి పూజించిరి.

నేడు మానవులు దేవుండ్లవలె పూజించు కొన్ని సంగతులను మనమిప్పుడు పరిశీలించుదాం. పురాతనమైనట్టియు నమ్మతగి నట్టియు నగు బైబిలు గ్రంధము ననుసరించి మన పరిశీలన కొనసాగించుదాం.

## దైవ సృష్టి

ప్రపంచములో ప్రకృతి నారాధించు వారున్నారు. ఒకడు ప్రాత:కాలముననే లేచి తూర్పుదిక్కున నున్న ఆ గంభీర సూర్యగ్రహమును మ్రొక్కను. దాని వెనుకనున్న సృష్టికర్తను జ్ఞప్తికి తెచ్చు కొనకుండగ అతడు దాని నారాధించును. అయితే మానవుడు ప్రకృతిని ఆరాధించుట యుక్తమైన పనియేనా? ఈ ప్రకృతి అంతయును దేవునిచే సృజింపబడెనని బైబిలు చెప్పుచున్నది. ప్రకృతి దేవుని సృష్టియై యున్నది. సూర్యుని, చంద్రుని, భూమిని, నక్షత్రములను మనము చూస్తుయుంటాము. అయితే వాటన్నిటికిని సృష్టికర్తయనేంవాడెవడూ లేకనే అవి అకస్మాత్తుగా వచ్చిపడె ననుట బుద్ధిహీనత యగును. సర్వసృష్టి కర్తయైన వాని నెరిగి ఆయనను పూజించుటకు బదులు, కొందరు సృష్టమునే పూజించుచున్నారు. దైవసృష్టి అంతటి మీదను భూమిపై మానవునికి దేవుడు అధికారము ననుగ్రహించెనని, బైబిలు నుడువుచున్నది. మానవుడెల్లప్పుడు దేవునికి భయపడి, ఆయనను పూజించు నిమిత్తము సృజింపబడెను. అందువలన సృష్టికర్తకు బదులు సృష్టిని మనము పూజింపరాదు. "అట్టివారు దేవుని సత్యమును అసత్యమునకు మార్చి సృష్టికర్తకు ప్రతిగా సృష్టమును పూజించి సేవించిరి" యని బైబిలు చెప్పుచున్నది (రోమా1:25).

మానవుడు దైవసృష్టిని పూజింపరానియెడల అతడు మానవ సృష్టినే పూజింపవచ్చునా? మన స్వహస్త కృతములైన దానిని దేనిని కూడ మనము దేవునివలె యంగీకరించుట మానవ జ్ఞానమునకు భిన్నముగ నున్నది. దేవుడు మానవుని సృజించెను గాని మానవుడు దేవుని సృజింపలేదు. ప్రపంచములో అనేకులు బంగారు వెండి రాతి విగ్రహములను ఆరాధించువారున్నారు. అయితే విగ్రహము లన్నియును మానవ హస్తకృతములని మరచిపోకుడి. ఇప్పుడు వాటి విషయమై బైబిలు ఏమి చెప్పుచున్నదో విందము: "అన్యజనుల విగ్రహములు వెండి బంగారువి, అవి మనుష్యుల చేతిపనులు. వాటికి నోరుండియు పలుకవు. కళ్ళుండియు చూడవు. చెవులుండియు వినవు. వాటి నోళ్ళలో ఊపిరి లేశమైనను లేదు. వాటిని చేయువారును, వాటియందు నమ్మిక యుంచువారందరును వాటితో సమానుల గుదురు" (దా. కీర్త 135:15-18).

## ఏథెన్సులో పౌలు

అపొస్తలుడైన పౌలు ఒక మారు ఏథెన్సు అను పట్టణమున కేగెను. ఆ పట్టణము విగ్రహములతో నిండియుండుట చూచినందున అతని ఆత్మ పరితాపము పట్టలేకపోయెను. నిజదేవుని గూర్చిన సత్యమును అతడు వారికిట్లు బోధించెను: "ఏథెన్సు వారలారా, మీరు సమస్త విషయములలో అతి దేవతాభక్తి గలవారై యున్నట్లు నాకు కనబడు చున్నది. నేను సంచరించుచు మీ దేవతా ప్రతిమలను చూచుచుండగా ఒక బలిపీఠము నాకు కనబడెను.దానిమీద-తెలియబడని దేవునికి అని వ్రాయబడియున్నది. కాబట్టి మీరు తెలియక దేనియందు భక్తి కలిగియున్నారో దానినే నేను మీకు ప్రచుర పరచుచున్నాను. జగత్తును, అందలి సమస్తమును నిర్మించిన దేవుడు, తానే ఆకాశమునకును, భూమికిని ప్రభువై యున్నందున,

హస్తకృతములైన ఆలయములలో నివసింపడు. ఆయన అందరికిని జీవమును, ఊపిరిని సమస్తమును దయచేయువాడు గనుక తనకు ఏదైనను కొదువ యున్నట్టు మనుష్యుల చేతులతో సేవింపబడువాడు కాడు. మరియు యావద్భూమి మీద కాపురముండుటకు ఆయన యొకనినుండి ప్రతి జాతి మనుష్యులను సృష్టించి, వారు యొకవేళ దేవునిని తడవులాడి కనుగొందురేమోయని, తన్ను వెదకు నిమిత్తము నిర్ణయకాలమును, వారి నివాస స్థలము యొక్క పొలిమేరలను ఏర్పరచెను ఆయన మనలో ఎవనికిని దూరముగా నుండువాడు కాడు. మన మాయనయందు బ్రతుకుచున్నాము, చలించుచున్నాము, ఉనికి కలిగియున్నాము. అటువలె మనమాయన సంతానమని మీ కవీశ్వరులలో కొందరు చెప్పుచున్నారు. కాబట్టి మనము దేవుని సంతానమైయుండి మనుష్యుల చమత్కార కల్పనవలన మల్చబడిన బంగారమునైనను వెంబడినైనను రాతినైనను దేవత్వము పోలియున్నదని తలంపకూడదు (అపొ.కా. 17:22-29). గనుక మిత్రులారా, మానవ హస్తకృతములు దేవుండ్లు కావనియు, వాటిని మనము పూజింపరాదనియు గ్రహించుడి.

## సాటి మానవుడు

మనము దైవసృష్టిని కాని, మానవసృష్టిని గాని ఆరాధించరాని యెడల మన సాటి మానవుని పూజింపవచ్చునా? ఈ ప్రశ్నను కొంతసేపు జాగ్రత్తగా ఆలోచించుడి. నీ పొరుగు వానిని దేవునివలె నెంచుచు, నీవు అతనికె చేయు సేవను ఉదాహరణ కొరకు ఊహించుము. నీ సాటి మానవుడే దేవుడయిన యెడల అతడు చేయు పనులలో నీవు చేయరాని వేమి? జీవితస్థాయిలో అతడు నీకంటె మిన్నయైనవాడా? కాదు. అతడు నీతో సాటియైనవాడేగదా? అయితే అట్టివానిని కూడ మనము దేవుడని

పూజింపరాదు. ఒకసారి కొర్నేలి యను భక్తిపరుడు అపొస్తలుడైన పేతురు నారాధింప మొదలిడిన సంగతి బైబిలునందొకటి వ్రాయబడి యున్నది. పేతురు దేవునిచే ఏర్పరచుకొనబడినవాడని అతడెరుగును. రక్షకుడైన యేసుక్రీస్తును గూర్చి మరింత విపులముగ వినునట్లు కొర్నేలి దేవుని దూత ఆజ్ఞానుసారముగ పేతురును తన యింటికి పిలిపించెను. అయితే పేతురు అతని యింటికి రాగానే కొర్నేలి తనకున్న గౌరవమును మిన్నగా ప్రకటింపనెంచి అతని పాదములపై పడెను. అయితే పేతురు పరిశుద్ధాత్మ ద్వారా "లేచి నిలువుము, నేను కూడ నరుడనే" అని పలికెను. ఇంకొకమాటలో మానవుడు సాటి మానవుని ఆరాధించుటను దేవుడు ఖండించెనని మనము గ్రహించుకొనవలసి యున్నది (అపొ.కా. 10:26).

## దైవదూత

పైన చెప్పుకొనిన మూడింటిని మనము ఆరాధింపరాని యెడల, దేవుని దూతలను ఆరాధింపవచ్చునా? అపొస్తలుడైన యోహాను ఒకమారు దేవునిదూతను పూజించుచు నమస్కరింప మొదలిడగా, అతడు తిరస్కరింపబడెను. ఈ విషయమై యోహాను ఇట్లు వ్రాయుచున్నాడు: "యోహానను నేను ఈ సంగతులను వినినవాడను, చూచినవాడను, నేను విని చూచినప్పుడు వాటిని నాకు చూపుచున్న దూతపాదముల యెదుట నమస్కారము చేయుటకు సాగిలపడగా, అతడు వద్దుసుమీ, నేను నీతోను, ప్రవక్తలైన నీ సహోదరులతోను ఈ గ్రంధమందున్న వాక్యములను గైకొనువారితోను సహదాసుడను. దేవునికే నమస్కారము చేయుమని చెప్పెను" (ప్రక 22:8-9). అలాగని మనము సాతానుని సేవింపరాదండి! సాతానుడు దేవ వ్యతిరేకి. దేవుని కుమారుడైన యేసుక్రీస్తుపై తన అస్త్రముల నతడు ప్రయోగింపయత్నించె నొకసారి. అయితే "సాతానా, పొమ్ము. ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని

వ్రాయబడి యున్నదని" చెప్పి క్రీస్తు వానిని ఖండించెను (మత్త 4:10).

ఇంతవరకును మానవులు ఆరాధించు ఆయా సంగతులను మనము పరిశీలించి యుంటిమి. ప్రభువైన దేవుని తప్ప మరి ఎవనిని మనము పూజించి, సేవింపరాదని నేర్చుకొంటిమి. దైవ మానవ సృష్టములను కాని, సాటి మానవుని కాని, దేవదూతను కాని, చివరకు సాతానునికాని మనము ఆరాధించరాదని గ్రహించితిమి. అయితే బైబిలు బయలుపరచు దేవుడు ఏమి పలుకుచున్నాడో ఇప్పుడు విందుము. నిర్గమకాండము 20వ అధ్యాయము 2వ వచనము నుండి 6వ వచనము వరకు చదువుదము. "నీ దేవుడైన యెహోవాను నేనే; నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైన ఆకాశమందేగాని, క్రింద భూమియందే గాని, భూమి క్రింద నీళ్ళయందేగాని యుండుదేని రూపమునయినను, విగ్రహము నయినను నీవు చేసికొనకూడదు. ఏలయనగా నీ దేవుడైన యెహోవా నగు నేను రోషము గల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు, నన్ను ప్రేమించి, నా ఆజ్ఞలను గైకొనువారిని వెయ్యి తరముల వరకు కరుణించువాడనై యున్నాను".

వరమందున్న అట్టి నిజదేవుని ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెనని ఆయన మనకు బోధించెను. నిజానికి బైబిలు బయలుపరచు దేవుడు నిజమైనవాడే. "దేవతలనబడిన వారును ప్రభువు లనబడిన వారును అనేకులున్నారు. మనకు ఒక్కడే దేవుడున్నాడు. అయితే అందరియందు ఈ జ్ఞానము లేదని" పరిశుద్ధాత్ముడు పౌలు ద్వారా పలికెను (1 కొరింథీ 8:5-7). సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవమని యేసుక్రీస్తు చెప్పెను (యోహా. 17 : 3).

గనుక ప్రియమిత్రుడా! నీ ఆరాధనమూర్తి యెట్టివాడు? ఆయన సజీవుడైన దేవుడా? కానియెడల నీవు తప్పక బైబిలు గ్రంథమును పఠించుము. నీవు దేవుని నారాధించుచున్న యెడల, ఆ దేవుడు బైబిలు చెప్పునట్టి సజీవుడైన దేవుడు కానియెడల, నీ ఆరాధన వ్యర్థమని గ్రహించుము.

# క్రైస్తవులు కాని కొందరు

## *(Some Who Are Not Christians)*

అనేకులు క్రైస్తవులమని చెప్పుకొందురు. అయితే ఆలాగున చెప్పుకొనువారందరు క్రైస్తవులు కారు. ఇదిో నీకు ఆశ్చర్యముగా యుండవచ్చును గాని ఇది నిజమే.

1. క్రైస్తవులమని చెప్పుకొను తల్లిదండ్రులకు ఒకడు పుట్టిన యెడల అతడు క్రైస్తవుడు కానేరడు. మానవమతములు కొన్నింటిలో ఒకడు జన్మముతోనే బౌద్ధుడని, హిందువుడని, ముస్లిముడని చెప్పబడునని నే నెరుగుదును. ఒక విధంగా చూచిన ఈ సంగతి కేథలిక్కులకు కూడా వర్తించుచున్నది. అయితే పవిత్రమైన క్రొత్త నిబంధన క్రైస్తవ్యములో ఇది వర్తించదు. క్రైస్తవ కుటుంబములో జన్మించిన మాత్రముననే ఎవడును క్రైస్తవుడు కానేరడు. ఒకడు క్రీస్తునందు విశ్వసించి ఆయనకు విధేయుడై, తిరిగి జన్మించుటద్వారా దేవుని కుటుంబములో ప్రవేశించినప్పుడే అతడు నిజముగా క్రైస్తవుడని చెప్పుకొన వచ్చును (యోహాను 3:3-6).

2. పుట్టినప్పుడే ఎవడైనను చిలకరింపు పొందితే దానిని బట్టి అతడు క్రైస్తవుడు కానేరడు. మొదటిగా బాప్తిస్మము చిలకరింపు కాదుగాని అది నీటి సమాధి (కొలస్స 2:12; రోమా 6:3, 4; అపొ.కా.8). రెండవదిగా బాప్తిస్మము పొందుచున్న వాడు ముందు దేవుని వాక్యమును విని (రోమా 10:17), దానిని నమ్మి (రోమా 10:10), తన పాపముల విషయమై మారుమనస్సు పొంది (లూకా 13:3) యేసు దేవుని కుమారుడని ఒప్పుకొనిన మీదటనే బాప్తిస్మము పొందవలెను. బాప్తిస్మము పొందబోవుచున్న వానికొరకు ఈ క్రియలను మరియొకడు చేయలేడు. మూడవదిగా, చిన్నపిల్లలు బాధ్యత యుక్తవయస్సు వచ్చువరకు వారు అమాయకులే (మత్తయి 18:1-3). గనుక పుట్టినప్పుడే చిలకరింపు పొందినను, మరింకెప్పుడు చిలకరింపు పొందినను, పొందినయతడు క్రైస్తవుడు కానేరడు. క్రీస్తుకు లోబడినప్పుడే ఒకడు క్రైస్తవుడు కాగలడు. చిలకరింపు దేవుని

ఆజ్ఞ కాదుగాని మానవ కల్పితమైనది.

3. క్రీస్తు దేవుని కుమారుడని ఎవరైనను నమ్ముచున్న యెడల్ ఆ నమ్మికను బట్టి మాత్రమే వారు క్రైస్తవులు కానేరరు. క్రీస్తు దేవుని కుమారుడని మనము తప్పక నమ్మవలయును. అయితే యిది మాత్రమే చాలదు. నమ్మికయుంచిన మాత్రముననే ఒకడు క్రైస్తవుడు కానేరడు. అట్లయితే నిజానికి దయ్యములు కూడా క్రైస్తవులగును. ఏలయనగా దయ్యములును నమ్మి వణకుచున్నవని బైబిలు చెప్పుచున్నది (యాకోబు 2:19). ఒకడు క్రైస్తవుడు కావలెనని అతడు క్రీస్తునందు విశ్వాసముంచవలెను. ఆ విశ్వాసమును బట్టి యేసు దేవుని కుమారుడని నమ్ముట మాత్రమే కాక, ఆయన బోధనలన్నిటికి లోబడి గెల్చునట్టి విశ్వాసము అతడు కలిగియుండవలెను (హెబ్రీ 5:8,9; యాకోబు 2:24). అంతే కాదు అతడు మరణపర్యంతము నమ్మకముగా యుండవలెను (ప్రకటన 2:10).

4. ఒకడు ఏదైనా డినామినేషన్ సంఘ సభ్యుడైనంత మాత్రమున క్రైస్తవుడు కానేరడు. ఈనాడు అనేక సంఘములున్నవి గనుక క్రైస్తవులమని చెప్పుకొనువారనేకులు గలరు. అయితే వారు మోసపోతున్నారు. క్రీస్తు ననుసరించువాడెవడును డినామినేషన్ సంఘసభ్యుడు కానేరడు. బైబిలు ఒక్కటే మాత్రమే క్రైస్తవులను చేయగలదు (అపొ.కా. 11:26). లేఖనములు మనలను వేరుపరచుట గాని క్రీస్తునందు మనలను ఏకమై యుండుమని (1 కొరింథీ 1:10). గనుక ఎవడైనను మానవకల్పిత సంఘ సభ్యుడయిన యెడల అతడు క్రైస్తవుడు కాడని యర్థము. అతడన్నిరకముల సాకులను, వాదనలను చేయవచ్చునుగాని, అతడు బైబిలు బోధించునట్టి నిజక్రైస్తవుడు కాదనునది యథార్థమై నిలుచును. అతడు నిజంగా క్రైస్తవుడయితే డినామినేషన్ సంఘములో యుండక నిజంగా క్రీస్తు సంఘసభ్యుడై క్రైస్తవునిగా మాత్రమే యుండును (అపొ.కా. 2:47; 1 పేతురు 4:16). బైబిలును బాగుగా చదివి నిర్ణయించుకొనుము.

Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.

5. క్రైస్తవుడని చెప్పుకొనునంత మాత్రముననే ఎవడును క్రైస్తవుడు కానేరడు. ఈ లోకములో అనేకులు అనేకరకమైన ఆరోపణలను చేసికొనవచ్చును. అయితే వాటిని నిరూపించిన యెడల వారు అబద్ధికులు, మోసగాండ్రు అగుదురు. ఇది యిట్లుండగా అనేకులు క్రైస్తవులమని సులభముగా చెబుతూ యుంటారు. అలాగున చెప్పుకొనుచుండువారు క్రైస్తవులే యని చాలమందికూడ భావించెదరు, అది అట్లు కాదు. ఒకడు దేవుని వాక్యము మూలముగను, తన జీవితమూలముగను క్రైస్తవుడయినట్లు నిరూపించలేనియెడల అతడెన్ని ఆరోపణలు చేసికొనుచున్నను క్రైస్తవుడు కానేరడు (మత్తయి 7:21-23).

నీ స్థితిని నీవే పరీక్షించుకొనుమని నీకు మనవి చేయుచున్నాను. నీవు క్రైస్తవుడవా? నీవు బైబిలు బోధనల ప్రకారము ఉన్న వానివా? దానిని ఋజువు పర్చగలవా? నీవు ప్రభువునకు లోబడితివా? నీవు ఆయనయెడల నమ్మకముగా నున్నావా? లేనియెడల నీవు ఆయనయందు విశ్వసించి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొని నీ పాపక్షమాపణ కొరకు బాప్తిస్మము పొందుటద్వారా క్రైస్తవుడవుకమ్ము (మార్కు 16:15,16; అపొ.కా. 2:38). క్రీస్తు నిన్ను రక్షించి, తన సంఘముతో చేర్చుకొనును (అపొ.కా. 2:47). అప్పుడు నీవు క్రైస్తవుడవు మాత్రమే కాగలవు (అపొ.కా. 11:26). నీవు నమ్మకముగా నున్నయెడల నిత్యరక్షణ నీదగును (రోమా 6:23; యోహాను 14:1-3).

--- జె.సి. ఛోట్

❁ ❁ ❁ ❁

---

గమనిక : సత్యవాక్కు వలయువారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.

# సబ్బాతు సంగతి ఏమిటి ?
## (*What about the Sabbath ?*)

### వివాదాంశము

మేము సెవెంతుడే అడ్వెంటిస్టు వారితో ఏకీభవించుచున్న అనేక సంగతులున్నవి. మేమిరువురము బైబిలును నమ్ముదుము. బైబిలు దేవుని నుండి కలిగెనని, మనము దాని ననుసరించవలెనని మేము నమ్ముదుము. క్రీస్తు పాపులకొరకై మరణించు నిమిత్తము వచ్చెనని మేము నమ్ముదుము. ఒక ధర్మశాస్త్రము లేక చట్టము సిలువకు మేకులతో కొట్టబడెను గనుక అది అంతమాయెనని మేమిరువురము నమ్ముదుము. అయితే సిలువయొద్ద అంతమొందినది ఏ చట్టమో అను సంగతిపై మేము భేదము కలిగి యున్నాము. అది మా మధ్యయున్న వివాదాంశము. ఈ అంశముపై మేము ఏకీభవించగలిగిన యెడల మిగిలిన భేదములు స్వల్పములగును.

ధర్మశాస్త్రమును గూర్చి ముఖ్యముగా సబ్బాతును గూర్చి సెవెంతుడే అడ్వెంటిస్టు వారు గైకొనిన స్థానము విపులముగా, పరిష్కారముగా ఇక్కడ తెలియజెప్పుటకు నేను సంకల్పించితిని. వారి స్థానమును గూర్చి సరిగ తెలిసికొనకుండ వారితో బైబిలు చర్చను జరిపించుట గురిలేకుండ తుపాకిని పేల్చుచున్నట్లుండును; కండ్లు మూసుకొని ఒక పటమును చిత్రీకరించుటకు ప్రయత్నించుచున్నట్లుండును. ఉన్న భేదములేమిటో తెలిసికొనకుండ వాటిని ఎట్లు పరిష్కరించుకోగలము? వారేమిచెప్పారో దానిని తెలియచెప్పుట నా ఉద్దేశ్యము.

యూదులు రెండు ధర్మశాస్త్రములను గైకొనిరని వారు నమ్ముదురు. దానిలో ఒకటి దేవుని ధర్మశాస్త్రమనియు, రెండవది మోషే ధర్మశాస్త్రమనియు పిలువబడెను. 'దేవుని ధర్మశాస్త్రము' అంతయు పది యాజ్ఞలలో యుండెను. అది నైతిక చట్టమని పిలువబడెను. ఈ నైతిక చట్టము ఇప్పుడు అమలులో యున్నది. మరియు కాలాంతము వరకు అమలులోనే

యుండును. ఏడవ దిన సబ్బాతు పది యాజ్ఞలలో ఒకటి గనుక, పది ఆజ్ఞలు ఇప్పుడు అమలులో యున్నవి గనుక, ఏడవ దిన సబ్బాతును గూర్చిన ఆజ్ఞను ఇప్పుడు పాటించుట చట్టబద్ధమై యున్నది.

'మోషే ధర్మ శాస్త్రము' [illegible]కే చట్టమై యున్నది. అది సిలువయొద్ద అంతమొనర్చబడెను. ఈ ఆచారయుక్త చట్టములో దహనబలులు, నైవేద్యములు, బలులు, పండుగదినములు, నెలసరి సబ్బాతులు మొదలుగునవి యుండెను. ఇవన్నియును సిలువయొద్ద సమాప్తమాయెను. ఈ చట్టము తీసివేయబడెను. గాని 'దేవుని ధర్మశాస్త్రమును' మాత్రము ఇప్పుడును అనుసరించవలెను. యూదులకు ఇయ్యబడిన రెండు ధర్మశాస్త్రములను గూర్చి ఎడ్వెంటిస్టు వారు చేయు బోధను ఈ దిగువ పట్టిక వివరించగలదు.

| దేవుని ధర్మ శాస్త్రము : | మోషే ధర్మశాస్త్రము : |
|---|---|
| నైతిక చట్టము | ఆచారయుక్త చట్టము ; |
| 10 ఆజ్ఞలు | బలులు, దహనబలులు, పండుగ దినములు, యితర సబ్బాతు దినములు, యేసు సిలువపై చనిపోయినప్పుడు ఈ చట్టము తీసివేయబడెను. ధర్మశాస్త్రము అంతమొందెనని చెప్పు వచనములు అన్నియు మోషే ధర్మశాస్త్రమునకు వర్తించునని వారు నమ్ముదురు. |
| 7వ దిన సబ్బాతు | |

అయితే బైబిలు ఇట్టి వ్యత్యాసమును కనపరచుచున్నదో లేదో మనము నిర్ణయించుట అత్యావసరము. ఒక చట్టమును దేవుని ధర్మశాస్త్రమని మరొకదానిని మోషే ధర్మశాస్త్రమని బైబిలు పిలుచుచున్నదా? యూదులకు ఇయ్యబడిన రెండు ధర్మ శాస్త్రములను గూర్చిన భేదము బైబిలులో యున్నయెడల ఈ రెండింటిలో తీసివేయబడినదేదో మనము

నిర్ణయింపవలసివచ్చును. బైబిలు ఈ పదములను పరస్పరపదములుగా వినియోగించిన యెడల, అట్లు వినియోగింపబడిన వాక్య భాగమును మనము కనుగొనవలెను. ఒకే ధర్మశాస్త్రమును సూచించుచు, దేవుని ధర్మ శాస్త్రము, మోషే ధర్మ శాస్త్రము అను పదములను బైబిలు వినియోగించు చున్నదా? ఇంకొక్క మాటలో ఉన్న ధర్మశాస్త్రములు రెండా? లేక ఒకటా?

## మోషే ధర్మ శాస్త్రము, దేవుని ధర్మ శాస్త్రము

మోషే ధర్మశాస్త్రము, దేవుని ధర్మశాస్త్రము అనునవి ఒక్కటే గాని రెండు కావు. ఇవి ఒకే ధర్మశాస్త్రమున కీయబడిన రెండు పేరులు. ఒకే ధర్మశాస్త్రమునకు బైబిలు లేఖకులు దేవుని ధర్మశాస్త్రము, మోషే ధర్మశాస్త్రము అను పదములను పరస్పరముగా వినియోగించిరి.

ఎజ్రా అను శాస్త్రి మోషే ధర్మశాస్త్ర గ్రంధమును తెప్పించెను (నెహెమ్యా 8:1). మరియు దానిని ప్రజలకు అతడు చదివి వినిపించెను. అది దేవుని ధర్మశాస్త్ర గ్రంధమనబడెను (నెహెమ్యా 8:8, 18). అక్కడ రెండు ధర్మ శాస్త్రములు లేవు గాని ప్రజలకు ఒకే ధర్మశాస్త్ర గ్రంధము నుండి చదివి వినిపించబడెను. ఒకే ధర్మశాస్త్రమును గూర్చి దైవావేశ లేఖకుడు ఈ రెండు పదములను వినియోగించెను. అది ఒక్కటే యని దేవుడు సూచించుచుండగా దానిని రెండుగా చేయు హక్కు యెవని కున్నది?

దేవుని ధర్మశాస్త్రము నైతిక చట్టమనియు, మోషే ధర్మశాస్త్రము ఆచారయుక్త చట్టమనియు అడ్వెంటిస్టువారు బోధింతురు. ఒక చట్టము సిలువకు మేకులతో కొట్టబడెను గాని అది ఆచారయుక్త చట్టమగు మోషే ధర్మశాస్త్రమని వారు బోధింతురు. అయితే ఇది బైబిలు కనుబరచని వ్యత్యాసమై యున్నది. 1 దిన వృత్తాంతములు 16:39, 40లో కొన్ని విధులు యెహోవా ధర్మ శాస్త్రములో యున్నట్లు మనము చూడగలము. "యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించిన ధర్మశాస్త్రమందు వ్రాయబడి యున్న

ప్రకారము ఉదయాస్తమయములందు అను దినమున నిత్యమైన దహన బలిని ఆయనకు అర్పించుటకై . . . . యాజకులను నియమించెను".

అడ్వెంటిస్టువారి సిద్ధాంతము రైటు అయితే, ఈ లేఖన భాగము తప్పు. ఈ దహన బలులు 'మోషే ధర్మ శాస్త్రములో వ్రాయబడి యున్న ప్రకారము' అని లేఖకుడు వ్రాసి యుండవలసినది గాని అతడట్లు చేయలేదు, సరిగదా అవి యెహోవా ధర్మశాస్త్రములో వ్రాయబడియున్న ప్రకారము అని అతడు ఖచ్చితముగా వ్రాసెను. యేసు చనిపోయినప్పుడు దహన బలులు, బలి పీఠము ఎత్తివేయబడెను. అవి యెహోవా ధర్మశాస్త్రములో వ్రాయబడెను గనుక 'యెహోవా ధర్మశాస్త్రము' సిలువయొద్ద అంతమొందెనని మనము గ్రహించుకొనవలెను.

దహన బలులను, సబ్బాతును 'యెహోవా ధర్మశాస్త్రము' నందు ఇమిడ్చిన మరియొక లేఖన భాగము 2 దినవృత్తాంతములు 31:3. "మరియు యెహోవా ధర్మశాస్త్రము నందు వ్రాయబడియున్న విధినిబట్టి జరుగు ఉదయాస్తమయముల దహన బలులను, విశ్రాంతి దినములకును, అమావాస్యలకును నియామక కాలములకును ఏర్పడియున్న దహన బలులను అర్పించుటకై తనకు కలిగిన ఆస్తిలోనుండి రాజు ఒక భాగమును ఏర్పాటు చేసెను".

దహనబలులు, విశ్రాంతి దినములు, పండుగలు యెహోవా ధర్మశాస్త్రమునందు వ్రాయబడియుండెను. అడ్వెంటిస్టువారి సిద్ధాంతము రైటు అయితే అవి అక్కడ గాక మోషే ధర్మశాస్త్రములో వ్రాయబడి యుండవలెను. దహనబలులు సిలువయొద్ద అంతమొందెనని అడ్వెంటిస్టు వారు బోధింతురు; దహనబలులు అంతమొందిన సమయమునందే సబ్బాతు కూడా అంతమొందెను. అవి ఒకే ధర్మశాస్త్రమందున్న సంగతులని బైబిలు విపులముగ బోధించుచున్నది.

యోషీయా ఏలుబడిలో 'మోషే ద్వారా యెహోవా దయచేసిన ధర్మ శాస్త్ర గ్రంథము యాజకుడైన హిల్కీయాకు కనబడెను' (2 దిన 34:14). ఆ గ్రంథము రాజునొద్దకు తేబడగా రాజు తన ప్రజలయొక్క భక్తి

జీవితములో అవసరమగు మార్పులను దిద్దుబాటులను చేయ నారంభించెను. ఈ మార్పులను గూర్చి మనము చదువుచుండగా ప్రజలు పస్కాను ఆచరించుటకు మొదలిడుటను గమనించగలము (2దిన35:1). యెహోవా ధర్మశాస్త్రమును బట్టి ఈ విధి ఆచరించుట వింతయైనది కాదు (2దిన 35:26); ఏలయనగా యూదులు యుగంలో రెండు ధర్మ శాస్త్రములు లేవు. యెహోవా ధర్మశాస్త్రము ఒకటి, మోషే ధర్మశాస్త్రము ఇంకొకటియను చేయు బోధ బైబిలు సంబంధమైనది కాదు. నీవు దేని నంగీకరింతువు? మానవుల బోధనా? లేక దేవుని బోధనా?

యూదుల చట్టప్రకారము మగశిశువునకు ఎనిమిదవ దినమున రెండు సంగతులు జరిగేవి. యేసు యూదునిగా జన్మించెను గనుక ఎనిమిదవ దినమున ఆయనకు పేరు పెట్టబడుట, సున్నతి చేయబడుట జరుగవలెనని మనము ఎరుగుదుము. దీని యొక్క రికార్డు లూకా 2:11-24లో మనకు లభించును : "ఆ శిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు, గర్భమందాయన పడక మునుపు దేవదూత చేత పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి. మోషే ధర్మశాస్త్రము చొప్పున వారు తమ్మును శుద్ధిచేసికొను దినములు గడచినప్పుడు ప్రతి తొలిచూలు మగపిల్ల ప్రభువుకు ప్రతిష్ఠ చేయబడవలెను అని ప్రభువు ధర్మశాస్త్రమందు వ్రాయబడినట్టు ఆయనను ప్రభువుకు ప్రతిష్టించుటకును, ప్రభువు ధర్మశాస్త్రమందు చెప్పబడినట్లు గువ్వల జతనైనను రెండు పావురపు పిల్లలనైనను బలిగా నర్పించుటకును వారు ఆయనను యెరూషలేమునకు తీసికొని పోయిరి' '.

మరియ శుద్ధిచేసికొను ఆచారము మోషే ధర్మశాస్త్ర ప్రకారమైనదని లూకా చెప్పుట నీవు గమనించితివా? అడ్వెంటిస్టువారి బోధ ప్రకారము ఆ యాచారము వ్రాయబడ వలసినది అక్కడనే. అయితే 24వ వచనములో గువ్వల జతను, రెండు పావురపు పిల్లలను సమర్పించుట ప్రభువు ధర్మశాస్త్ర మందు చెప్పబడెనని లూకా వ్రాసెను. ఈ

యాచారములను మోషే ధర్మశాస్త్రము, ప్రభువుధర్మశాస్త్రము అను పదములను బట్టి అతడు సూచించెను.

లూకా పొరబడెనా? ప్రభువు ధర్మశాస్త్రములో కేవలము పది యాజ్ఞలే యున్న యెడల, ప్రభువు ధర్మశాస్త్రములో వ్రాయబడినట్లు బలి నర్పించుడి యని అతడు ఎందుకు చెప్పెను? మనము లూకాను నమ్మవచ్చునా ? అతడు ఒక అబద్ధ సాక్షియా? ఈ విషయములో పొరబడిన యెడల అతడు దైవావేశము కలిగియుండెనా? అతడు దివ్య ప్రేరణ కలిగి యుండని యెడల, అపొస్తలుల కార్య గ్రంథమును కూడా అతడు వ్రాసెను గనుక సంఘారంభమును గూర్చియు, దాని ఆదిమ చరిత్రను గూర్చియు నమ్మదగిన వర్ణన మనకు ఎక్కడ లభించును? ప్రభువు ధర్మశాస్త్రమందు వ్రాయబడిన బలులను గూర్చి అతడు నిజము చెప్పని యెడల, పెంతెకోస్తునాడు రక్షింపబడిన మూడు వేలమందిని గూర్చి అతడు నిజము చెప్పెనని మనకెట్లు తెలియును? అతడు నమ్మదగిన వాడు కాని యెడల రక్షింపబడు విధానమును గూర్చి అపొస్తలుల కార్యములలో యున్న సందర్భములను ఎట్లు చూపించగలము ?

లూకా సత్యమునే చెప్పెను. దివ్య ప్రేరణ గలవక్త అతడు. అతడు వ్రాసిన ప్రతి మాటను నీవు నమ్మవచ్చును. అపొస్తలుల కార్యముల గ్రంథములో అతడు వ్రాసిన రక్షింపబడినవారి ఉదాహరణలను నీవు ఇంకను నమ్మవచ్చును.

పది యాజ్ఞలు దేవుని ధర్మశాస్త్రమని, విధిరూపక చట్టము మోషే ధర్మశాస్త్రమని చేయు వ్యత్యాసము ఆధునికమైనది. క్రైస్తవ యుగములో సబ్బాతు సిద్ధాంతము నాచరించువారి యోగ్యతను ఇది ప్రశ్నించుట కాదు. నేను ఈ అంశమును గూర్చి చర్చించిన వారు నిష్కపటులు, వారి సిద్ధాంతమును బాగుగా ఎరిగి యుండినవారు. మరియు ఈ నాటి మానవులకది దేవుని చిత్తమని నిజముగా భావించినవారు.

అయితే నిష్కపటత్వము ఒక అబద్ధ సిద్ధాంతమును సత్యబోధగా

మార్చలేదు. సహృదయత వలన అసత్యాచారము సత్యాచారముగా మార్చబడదు. క్రీస్తు తన ప్రశస్త రక్తమిచ్చి సంపాదించిన సంఘమును సౌలు వ్యతిరేకించెను. పౌలు క్రైస్తవుడైన తరువాత తాను చేసిన అక్రియను సమర్ధించుటకు ప్రయత్నించలేదు (1తిమో 1:13). తన పూర్వజీవితమును గూర్చి చెబుతు, "నేను నేటి వరకు కేవలము మంచి మనస్సాక్షి గలవాడనై దేవుని యెదుట నడుచు కొంటినని చెప్పెను" (అపొ.కా. 23:1).


పాత నిబంధనలో రెండు ధర్మశాస్త్రములున్నవని యేసు బోధించలేదు."నీతల్లిదండ్రులను ఘనపరచవలెనని మోషే చెప్పెను గదా' యని ఆయన చెప్పెను (మార్కు 7:10). "నీ తల్లిదండ్రులను ఘనపరచవలెనని మోషే చెప్పినట్లు మన ప్రభువు వక్కాణించెను. దానిని మోషే ఎక్కడ చెప్పెను ? అది నిర్గమ 20:12 లో పది యాజ్ఞలలో ఒక ఆజ్ఞ యని దానిని మనము గుర్తించగలము. అడ్వెంటిస్టు వారి ప్రకారము దానిని మోషే ఏమాత్రమును చెప్పలేదు ఏలయనగా ఆపది యాజ్ఞలు దేవుని ధర్మశాస్త్రమై యున్నవి. యేసు ఈలోక రక్షకుడు కాదా? నీతల్లిదండ్రులను ఘనపరచవలెనని చెప్పిన వారెవరో ఆయనకు తెలియదా? అది దేవుని కుమారునికి తెలియదా? లేక ఆయన పొరబాటు చేసెనా? యేసుకు తెలియును, ఆయన పొరబాటు చేయలేదు, దానిని గూర్చి ఆయన సత్యమునే చెప్పెను. పాతనిబంధనలో రెండు ధర్మశాస్త్రములున్న వను సిద్ధాంతమును యేసు బోధించలేదు. ఈ సిద్ధాంతము అధునికంగా ఆరంభమైనది. దానిని బైబిలు ఆమోదించుట లేదు.

మన ప్రభువడిగిన ఈ ప్రశ్నను గమనించుము : "మోషే మీకు ధర్మశాస్త్రము ఇయ్యలేదా? అయినను మీలో ఎవడును అధర్మశాస్త్రమును గైకొనడు; మీరెందుకు నన్నుచంప జూచుచున్నారు?' ' (యోహాను 7:19). ధర్మశాస్త్రమును? మోషే ఒక ధర్మశాస్త్రము నిచ్చెనని అడ్వెంటిస్టు వారంగీకరింతురు. గాని పది యాజ్ఞలను మోషే ఇచ్చినట్లు వారునమ్మరు. మోషేధర్మశాస్త్రమునిచ్చెనని, అయితే వారాయనను

చంపజూచుచునారు గనుక వారు ధర్మశాస్త్రమును గైకొనుట లేదని యేసు వారిని నిందించెను; ఏలయనగా నరహత్య చేయవద్దు అనునది పది ఆజ్ఞలలో ఒకటి. మోషే ధర్మశాస్త్రము నిచ్చెనని ప్రభువు నిష్కర్షగా చెప్పుచున్నప్పుడు అతడియ్యలేదని యెవడు చెప్పును? పది ఆజ్ఞలను మోషే కాదు దేవుడిచ్చెనని అడ్వెంటిస్టువారు బోధింతురు గనుక ఈ విషయములో వారి సిద్ధాంతమును బట్టి యేసు తప్పు.

(మిగతా వచ్చే సంచికలో)

--- ఆల్బర్ట్ గార్డనర్




ఇప్పుడు **తేజ ఛానల్**లో ప్రతి శనివారం ఉదయం 6.30 నుండి 7.00 వరకు చూడండి. మీ బంధుమిత్రులతో కలసి టి.వీ. ద్వారా సువార్తను వినండి.

ప్రసంగీకులు : జాషువా గూటం

# బైబిలును అర్థము చేసికొనుటకు పదిసూత్రములు
## (Ten Simple Reasons to Understand the Bible)

ప్రపంచ గ్రంథము లన్నిటిలోను గొప్ప గ్రంథముగా నేటికిని బైబిలు ఉన్నది. మనము 21వ శతాబ్దములో యున్నాము. అయినను బైబిలు గొప్ప గ్రంథముగాను, పెక్కు మందిచే చదువబడుచున్న గ్రంథముగాను నేటికిని తన స్థానమును కోల్పోవకుండ యున్నది. ప్రతి సంవత్సరము ఇంచుమించు 4 కోట్ల బైబిళ్ళు ముద్రించబడుచున్నవి. ఈ ముద్రణ కార్యక్రమములో 1,53,000 మంది అనుదినము ప్రపంచమందంతటా పని చేయుచున్నారు. ఆధునిక మానవునికి అత్యవసరమైన గ్రంథము బైబిలు.

బైబిలును అంతమంది ఎందుకు ప్రేమించుచు చదువుచున్నారు? ఏలయనగా తనను గూర్చి బైబిలు ఏమని చెప్పుకొనుచున్నదో అది వాస్తవమని వారెరుగుదురు: మానవులకు దేవుడిచ్చిన వర్తమానము అది. అపొస్తులులు, ప్రవక్తలద్వారా దేవుడు బైబిలునందలి 66 పుస్తకములను పరిశుద్ధాత్మని బయల్పాటువలన లిఖించి యిచ్చెను. అది దైవ ప్రేరణచే వ్రాయబడెను. II తిమోతి 3:16, 17; యోహాను 14:26; యోహాను 16:13; ఎఫెసీ 3:4-5 లను దయచేసి చదువండి.

బైబిలు దేవునినుండి కలిగినదని అనేక సంగతులు నిరూపించుచు[illegible]: కొందరు పురాతత్వ శాస్త్రజ్ఞులుమొదట వారు నాస్థికులైనను, వారు త్రవ్వి కనుగొనిన సత్యములను బట్టి బైబిలు చారిత్రాత్మకముగాను, భౌగోళికముగాను యదార్థమని గ్రహించి విశ్వాసులుగా మార్చబడిరి. గొప్ప విజ్ఞానశాస్త్ర సంబంధమైన సత్యములు బైబిలు నందుండుటచే అది దైవప్రేరిత గ్రంథమని విశదమగుచున్నది. అందరు భూమి బల్లపరుపుగానుండెనని నమ్ముతుండె, దాని లేఖకులు అది గుండ్రముగా నుండెనని వ్రాసిరి (యెషయా 40:22). భూమి దేనిపై ఆధారపడి యున్నదో యని శాస్త్రవేత్తలు తర్కించుకొనుచుండగా, "దేవుడు శూన్యముపై భూమిని వ్రేలాడజేసెనని" అది చెప్పుచున్నది (యోబు 26:7). 40 మంది లేఖకులు 1600 సంవత్సరముల కాలములో దాన్ని వ్రాసినను దానిలోని ఏకత్వమును బట్టి అది మానవుని మేధస్సు వలన కాదుగాని

దేవునినుండి కలిగినదని నిరూపణ యగుచున్నది.

మనము బైబిలును అర్థము చేసికోగలము, అర్థము చేసుకోవాలి: మన హృదయం నిష్కటమైనదయితే దాని ప్రాధమిక బోధలను సునాయాసంగా అర్థము చేసికోగలము. దాన్ని అర్థము చేసుకోడానికి మనము తప్పక ప్రయత్నించాలి. గనుక ఆనందభరితమైన సమృద్ధి జీవితమును ఇప్పుడే మనం ఆరంభింపవచ్చును. దేవుని చిత్తమును జరిగించుచున్నామని తెలిసికొనుటలోను, పరలోకము మనదగునని ఎరుగుటలోను మనకు గొప్ప ఆనందము కలుగును. గనుక బైబిలును అర్థము చేసికొనుటకు 10 సూక్ష్మ సూత్రములను ఈ పత్రిక ద్వారా మీకు అందించుచున్నాను.

**1. దానిని అర్థము చేసికొను కోరికతో పఠించుము:** మనం అర్థము చేసుకొనుటకే దేవుడు బైబిలు నిచ్చాడు. "మీరు అవివేకులు కాక ప్రభువు చిత్తమేమిటో గ్రహించుకొనుడి" యని ఎఫెసీ 5:17 చెప్పుచున్నది. బెరయలోని ప్రజలు ప్రతి దినము లేఖనములను పరిశోధించుచు వచ్చిరి గనుక వారు ఘనులని చెప్పబడినది (అపొ.కా. 17:11). యితరులైతే "యెల్లప్పుడు నేర్చుకొనుచున్నను సత్యము విషయమైన అనుభవజ్ఞానము ఎప్పుడు పొందలేని" బుద్ధిహీనులని చెప్పబడినది (2 తిమో 3:6,7). దేవుని యెడల ప్రేమ, ఆయన వాక్యమును గ్రహించుకోవాలనే కోరిక యున్నప్పుడు బైబిలును మనం అర్థము చేసికోగలము."నీతి కొరకు ఆకలిదప్పులు గలవారు ధన్యులు. వారు తృప్తిపరచ బడుదురు". అని యేసుప్రభువు చెప్పెను (మత్తయి 5:6). మనం దేనికొరకైనా ఆకలిదప్పులు కలిగియుంటే ఆ కోరికను తీర్చు కొనుటకు ప్రయత్నింతుము.

(సశేషం)

--- చార్ల్స్ స్కాడ్

గమనిక : సత్యవాక్కు వలయువారు సంవత్సరమునకు 30/- రూ॥లు చందా విధిగా పంపించవలయును.

**Satya Vani, P.O.Box - 80, Kakinada - 533 001.**

గారు వాక్యోపదేశము గావించిరి. చదలాడ, గోరింటలలో సోదరులు యం. ప్రేమ్‌కుమార్ గారు సువార్త చాటుచున్నారు.

డిశంబరు 16వ తేదీ సోమవారం తూర్పుగోదావరి జిల్లా సీతానగరంలో నూతనముగా నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయ ప్రతిష్ట కార్యక్రమము జరిగెను. సీతానగరంలో రాజమండ్రి రామదాస్‌పేట క్రీస్తు సంఘము, మరియు వి. సుదర్శన్‌రావ్ గారి నిర్విరామ కృషితో క్రీస్తు సంఘము నెలకొల్పబడుటయే గాక, ఒక చక్కటి అనుకూల ప్రదేశములో స్థలము సేకరించి ఆలయము నిర్మించుట కూడా జరిగినది. సోదరులు జాషువా గూటం, వి. సుదర్శన్‌రావ్ గార్లు రిబ్బన్ కత్తిరించి ఆలయ ప్రతిష్ట గావించిరి. జాషువా గారు వాక్యోపదేశము గావించిరి. యం. యేసుపాదం గారు ఆయా సువార్తికులను సభకు పరిచయం చేసిరి, యి. అబ్రాహాము (టి. తిమ్మాపురం) గారు అధ్యక్షత వహించిరి. మరియు పి.జాన్‌మోజెస్ (గొల్లపాలెం), వి. హిట్లర్ (రాజమండ్రి), జి.డి.వి.కె ప్రసాద్ (కొయ్యల గూడెం), ఎ. విశ్వేశ్వరరావ్ (కొవ్వూరు) గార్లు క్లుప్తముగా వాక్యోపదేశము గావించి సోదరులు సుదర్శనరావ్ గారిని అభినందించిరి. ఎ. జ్ఞానరాజు, కె. చిట్టిబాబు (రాజమండ్రి), యం. విజయానంద్ (బుచ్చెంపేట) గార్లు వాక్యపఠనములోను ప్రార్ధనలలోను సహకరించిరి. ఆనాటి సభకు మతశాఖల భోధకులు కూడ అనేకులు హజరై సత్యవాక్యమును వినుట విశేషము. హాజరైనవారందరికీ మంచి విందు జరిగెను.

డిశంబరు 24వ తేదీ రాత్రి పాతనాయంక పల్లిలో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయ ప్రతిష్ట ఘనముగా జరిగెను. సోదరులు జాషువా గూటం గారు ఆలయ ప్రతిష్ట గావించి వాక్యోపదేశము చేసిరి. పాతనాయకం పల్లిలో సోదరులు టి. ఆనందరావ్ గారు సువార్త చాటుచున్నారు. డిశంబరు 25వ తేదీ రాత్రి పశ్చిమగోదావరి జిల్లా విప్పర్రు గ్రామములో గొప్ప సువార్త సభ జరిగెను. వందలాది ప్రజలు హాజరై సువార్త వాక్యము వినిరి. జాషువా గారు అక్కడ వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము ఇంచుమించు 1500 మందికి ఆ రాత్రి మంచి భోజనము నేర్పాటు చేసిరి. విప్పర్రులో సోదరులు టి.సి.హెచ్. ఫ్లెమింగ్స్ గారు, వారికుమారుడు సైలస్ గార్లు సువార్త

26వ తేదీ నాడు పులిమేరులో జరిగిన సువార్త కూటములో జాషువాగారు వాక్యపరిచర్య చేసిరి. స్థానిక సంఘము సండే స్కూలు పిల్లలకు మంచి బహుమతులను కూడ అందచేసిరి. పులిమేరులోను, రఘుదేవపురంలోను సోదరులు యం. కృపానందం గారు క్రీస్తు కొరకు ఆయన సంఘము కొరకు గట్టిగా పనిచేయుచున్నారు.

డిశంబరు 28వ తేదీ శనివారం పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులో నిర్మించబడిన క్రీస్తు సంఘ ఆలయ ప్రతిష్ఠ ఘనముగా జరిగెను. పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు, స్థానికులు ఆ కార్యక్రమములో పాల్గొనిరి. సోదరులు వి. సుదర్శన రావ్ (రాజమండ్రి), పి. జాన్ మోజెస్ (గొల్లపాలెం), వి. హిట్లర్ (రాజమండ్రి), జాషువాగూటం తదితర్లు వాక్య పరిచర్య చేసిరి. సోదరులు ఎ. విశ్వేశ్వర రావ్ గారి కృషివలన కొవ్వూరులో ఆలయ నిర్మాణము జరిగెను. ఆయన కొవ్వూరులోను, ఆంధ్రలో అనేక జిల్లాలలోను సువార్తను చాటుచు, సంఘములను బలపరచు చున్నారు.

RNI Regd. No. 69973/98
Postal Regd. No. VM/KD/02/2002

from:
SATYA VAKKU
P.O. BOX 80,
KAKINADA - 533 001

To

Edited & published by Joshua Gootam & published at SATYA VANI, Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. Kakinada-533 004.